క్లుప్తంగా

ఉత్సాహంగా మండల స్కూల్ గేమ్స్



అండర్-14 షార్ట్‌పుట్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: క్రీడా పోటీలను విద్యార్థులు ఉప యోగించుకుని ప్రతిభాపాటవాలను చాటాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దెందులూరు మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 క్రీడల ఎంపికలు ఆదివారం దెందులూరు గార పాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో కొనసాగున్నాయి. మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు బాలుర, బాలికల విభాగంలో సెలెక్షన్స్‌పోటీలు నిర్వహిస్తున్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి ఏచూరి



ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భీమడోలు: దేశం గర్వించదగ్గ మేధావి, కార్మిక వర్గ పక్షపాతి కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి మరణం దేశానికి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులో సీపీఎం కార్యాలయంలో ఆదివారం సంతాప సభను నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా నేత కట్టా భాస్కరావు అధ్యక్షత వహించారు. సీపీఎం నేతలు నారపల్లి రమణారావు, కోన శ్రీనినవాసరావు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

భీమడోలు: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజు లు గడిచినా నేటికీ సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదని, ఎన్నికల హామీలు వరదల్లో కొట్టుకుపోయాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముల్లగిరి జాన్సన్ భీమడోలులో ఓ ప్రకటనలో విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన అమ్మకు వందనం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్ ప్రయాణం , మహిళలకు రూ.1,500 తదితర హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. విజయవాడ పెనుముంపు మానవ తప్పిదమేన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో సైతం కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు పర్యటించలేదన్నారు. వరద ముంపు ప్రాంతాల్లోని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

17, 19లో వ్యాయామ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

దెందులూరు: ఈ నెల 17, 19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కోఆర్డినేటర్ తెలిపారు. 17న నియోజకవర్గ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి హాజరు కానున్న ఉపాధ్యాయుల తమ వివరాలు ఉదయం 10.30 గంటలకు గూగుల్ ఫారంలో నింపి పంపాలన్నారు. ఎంఈలు, జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారులు వ్యాయామ స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణను విధిగా తనిఖీ చేస్తారని వ్యాయామ ఉపాధ్యాయులందరూ గమనించాలన్నారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె

దెందులూరు: ప్రభుత్వ జూనియర్ డాక్టర్లు ఆదివారం నుంచి రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మెలో పాల్గొన్నారు. జూనియర్ డాక్టర్ల భవిష్యత్తును నాశనం చేసే విధంగా వెలువడిన జీవో 85లో పలు అంశాలను పరిష్కరించే వరకూ సమ్మెబాట తప్పదని యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. యూనియన్ పిలుపుమేరకు ఆదివారం మండలంలోని పోతునూరు, దెందులూరు, గోపన్నపాలెం వైద్యశాలల నుంచి జూనియర్ డాక్టర్లు చలో విజయవాడ తరలివెళ్లారు. మూడు వైద్యశాలల్లో సాధారణ వైద్యసేవలను నిలుపుదల చేసి అత్యవసర వైద్యసేవలను మానవతా దృక్పథంతో వైద్యులు సేవలందిస్తున్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

ఉంగుటూరు: నారాయణపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ల లోకనాథ్, లక్ష్మీనారాయణ అనే అన్నదమ్ముల మృతి కేసులో నిందితులను అరెస్టు చేయాలని నగర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య ఆదివారం డిమాండ్ చేశారు. క్రికెట్ బుకీ పేరుతో రూ.2 కోట్లు కాజేసి, మరొకొంత సొమ్ము కోసం వారిని వేధింపులకు గురి చేయటం వల్లే అన్నదమ్ములు ఇద్దరూ ఉరేసుకుని వారణాసిలో చనిపోయారని తెలిపారు. వేధింపులకు గురిచేసిన దండుగోపాలకృష్ణ, కమ్ముల సాయితేజ, కమ్ముల గోపి, గుర్రంప్రసాదును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈనెల 11న పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కన్నయ్య వివరించారు.

వరిపైరుపై తెగుళ్ల ఉధృతి

- చిరుపొట్ట దశలో వెంటాడుతున్న చీడపీడలు
- ఆందోళనలో అన్నదాతలు
- ముమ్మరంగా నివారణ చర్యలు



తెగుళ్ల నివారణకు పెదవేగిలో మందులు పిచికారీ చేస్తున్న రైతు

పెదవేగి : తొలకరిపై తెగుళ్ల దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ఖరీఫ్ పంటపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో ఉల్లికోడు, తెల్లదోమ, మాగుడు తెగుళ్ల ఆశించి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. నివారణ చర్యలతో పెట్టుబడి తడిసి మోపడవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లికోడు నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

41,500 ఎకరాల్లో సాగు

నియోజకవర్గానికి పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో 41,500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చిరుపొట్ల దశ నుంచి పొట్ట దశల్లో ఉంది. ఈ దశలో పలుచోట్ల మాగుడు, తెల్లదోమ, ఉల్లికోడు ఉండటం రైతులను కలవరపరుస్తోంది. మాగుడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో తెల్ల దోమ బెడద అధికంగా ఉందని రైతులు అంటున్నారు. తెల్లదోమ ఆకుల్లో రసాన్ని పీల్చేయడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయంటున్నారు. ఉల్లికోడు ప్రభావంతో వరి దుబ్బు మధ్యలోని ఆకులు చుట్టబెట్టుకుపోయి వెన్ను రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఆయా తెగుళ్ల పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, నివారణ కోసం ఎకరాకు రూ.వెయ్యి వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందంటున్నారు.

దోమ ఆశించడానికి కారణాలు

సాధారణంగా సెప్టెంబర్ నుంచి ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడాలి. కాని అందుకు భిన్నంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న అధిక ఉష్ణోగ్రతలు, వాతావారణంలో తేమ అధికంగా ఉండడం, ఉక్కపోత వాతావరణం దోమ ప్రబలడానికి దోహదమవుతోంది. దీనికి తోడు ఏడాది పొడవునా వరి సాగు చేయడం, నారు దశవ నుంచే రైతులు రెండు మూడు రకాల సస్యరక్షణ మందులను మిశ్రమం చేసి పిచికారీ చేయడం, నత్రజని కలిగి ఉన్న ఎరువులను మోతాదుకు మించి వాడడం దోమ ప్రబలడానికి కారణంగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నివారణ ఇలా

తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెదవేగి వ్యవసాయాధికారి ఎం ప్రియాంక వివరించారు. మాగుడు నివారణకు అరికట్టేందుకు ఎక్సాకొనేజాల్ లేదా వెలిడామైసిన్ మందును లీటర్ నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణ కోసం ఎసిపేట్ మందును లీటర్ నీటికి 1.6 గ్రాములు చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లికోడుకు తెగులుకు నివారణ లేదని, పొలంగా తెగులు కనిపిస్తే మిగిలిన దుబ్బులకు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా కార్బొసిరాన్ లేదా, కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 10 కిలోలు చొప్పున వేయాలన్నారు.

పెరిగిన పెట్టుబడి



వరి సాగులో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ఏడాది తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది.

– జలగం రామ్మోహనరావు, వంగూరు రైతు

సూచనలు పాటించాలి



వరి చేనును తెల్ల దోమ, సుడి దోమ తొలి దశలో ఆశిస్తుంది. రైతులు విచక్షణారహితంగా పురుగు మందులను వాడకూడదు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఎం. ప్రియాంక, వ్యవసాయాశాఖాధికారి, పెదవేగి

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దెందులూరు: అన్ని బంధాల్లో కంటే స్నేహబంధం , అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల పూర్వ అధ్యాపకులు బి.సత్యనారాయణరాజు, కృష్ణంరాజు అన్నారు. ఆదివారం వ్యాయామ కళాశాలలో 1993-94 యూజీడీ, బీపీఈడీ విద్యార్థినీ విద్యార్థుల 30 సంవత్సరాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత 30 ఏళ్ల తరువాత కలిసిన యూజీడీ, బీపీఈడీ విద్యనభ్యసించి నేడు పాఠశాలలు, కళాశాలల్లో పీడీలు, పీఈటీలుగా ఇతర ఉద్యోగాల్లో స్థిరపడిన వారి వివరాలు, కుటుంబసభ్యుల వివరాలను ఒకరికొకరు పంచుకున్నారు. 30 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో సమ్మేళనంలో ప్రతి ఒక్కరూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు సత్యనారాయణరాజు, కృష్ణంరాజు, బంగార్రాజు, రామరాజు, రామ్మోహనరావు, వీరభద్రరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆర్‌పీఈ ఎం.మనోహర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా 30 ఏళ్ల తరువాత చదివిన కళాశాలను మరిచిపోకుండా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మధురానుభూతులను పంచుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 1993-94 సంవత్సరాల బ్యాచ్ విద్యార్థులను అభినందించారు. అనంతరం 1993-94 విద్యార్థుల సంఘ నాయకులు, ఫిజికల్ డైరెక్టర్ మరీదు రాజా మాట్లాడుతూ 1993-94 విద్యార్థులందరూ చదువుకున్న కళాశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. తమ ఉన్నతితో పాటు వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలను తాము ఎప్పటికీ మరువలేమని విద్యార్థులు అన్నారు. ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు మాట్లాడుతూ 30 ఏళ్ల తరువాత చదువుకున్న కళాశాలలో విద్యార్థులు కలుసుకోవడం శుభసూచకమన్నారు.

గంగానమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు



ఉండ్రాజవరంలో వారాల పండగ సందర్భంగా శక్తివేషధారుల నృత్య ప్రదర్శన

భీమడోలు: భీమడోలులో ఆదివారం వారాల పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక వెలమపేట ఏరియాలో గంగానమ్మ తల్లి భారీ ప్రభలను విశేషంగా అలంకరించి ఎడ్లబండ్లపై ఉంచి భక్తుల చెంతకు తీసుకుని వెళ్లారు. తమ కుల దైవాన్ని భక్తిశ్రద్ధలతో పూజించారు. అక్కడ భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు నీళ్ల పోసి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. కోర్కెలు తీర్చే గంగానమ్మ తల్లిని తమ ఇలువేల్పుగా పూజిస్తారు. ఏటా వినాయక చవితి మరసటి రెండో ఆదివారం వారాల పండుగను నిర్వహిస్తారు. దీనితో ఆ ప్రాంతంలో పుట్టి దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంత గ్రామాలకు రావడంతో గ్రామాల్లో సందడిగా మారాయి. దీనితో పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రభల వెంట ఏర్పాటు చేసిన వివిధ నృత్య ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, జిల్లా నాయకులు పుప్పాల హరీష్, పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మకు గ్రామోత్సవం

దెందులూరు: ఉండ్రాజవరంలో వారాల పండుగలో భాగంగా గ్రామదేవత కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వీధుల్లో ఊరేగింపుగా వచ్చిన అమ్మవారికి మహిళలు హారుతులిచ్చి పూజలు చేశారు.

గాయత్రి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఔదార్యం

పెదవేగి : వరద బాధిత కుటుంబాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శ్రీ గాయత్రి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అండగా నిలిచింది. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన శ్రీ గాయత్రి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్‌లో సుమారు రూ.1000 విలువ చేసే నిత్యావసర సరుకులను 150 కుటుంబాలకు పంపిణీ చేశారు. సేవా సమితి కార్యదర్శి పార్వతీశ్వర శర్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్ధవరపు సుబ్బారావు, అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు రూ.62,597 ఆదాయం

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు విచ్చేసి మొ క్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మ వారికి పూజా టికెట్ల ద్వారా రూ.27,355, విరాళాలు రూ.22,642, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 11,250, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,350 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

వయోజన విద్య ప్రాధాన్యతను గుర్తించాలి

ఉంగుటూరు: వయోజన విద్య ప్రాధన్యతను అందరూ గుర్తించాలని పలువురు అన్నారు. కైకరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు చేబ్రోలు కార్మెల్ హైస్కూలు ఆధ్వర్యంలో ఆదివారం వయోజన విద్య కార్యక్రమంలో గతంలో నేర్చుకున్న అంశాల పాటు, విద్య ప్రాధాన్యత వివరిస్తూ అభ్యాసకులు నినాదాలు చేశారు. వయోవృద్ధులు గుత్తికొండ కృష్ణారావు, ఆకుల రాంబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ వయోజన విద్యాప్రాముఖ్యతను వివరించారు.

వైభవంగా వినాయకుడి ఊరేగింపు



జగన్నాథపురంలో గణనాథుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



పోతునూరు సాయిబాబా వీధిలో విఘ్నేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

దెందులూరు: అన్ని గ్రామాల్లో వినాయకుడి ఊరేగింపులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పోతునూరు సాయిబాబా వీధిలో నిర్వాహకులు, గ్రామస్తులు పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు, యువత కేరింతల నడుమ స్వామివారి ఊరేగింపు, నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. చల్లచింతలపూడిలో విఘ్నేశ్వరుడికి యువత, గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. పోతునూరు, కొవ్వలి, దెందులూరు, రామారావుగూడెం, పెరుగ్గూడెం, సోమవరప్పాడు గ్రామాల్లో స్వామివారికి పూజలు చేశారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనం

గణపవరం: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గణపవరం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. తొమ్మిదవ రోజైన ఆదివారం గణనాథుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి తరలించారు. బ్యాండుమేళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, విచిత్ర వేషాలు, గరగల నృత్యాలు, శక్తివేషాలతో వైభవంగా గణనాథులను గ్రామాల్లో ఊరేగించారు. గణపవరంలోని వెలంపేట యూత్, మసీదు సెంటర్ యూత్, తోట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను ఆదివారం భారీగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. బాలయ్య చెరువు వద్ద వినాయక చవితి మండపం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.



గణపవరంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

బోనస్ బకాయిలు చెల్లించకుంటే న్యాయ పోరాటం



భీమడోలు సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధి ఆర్.వెంకటాచార్యులు

భీమడోలు: సూరప్పగూడెం సహకార చక్కెర ఫ్యాక్టరీ రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన బోనస్ బకాయిలను తక్షణమే చెల్లించకుంటే న్యాయ పోరాటం చేస్తామని కార్యాచరణ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. భీమడోలు సంతమార్కెట్ వద్ద గల అమ్మవార్ల ఆలయాల వద్ద ఆదివారం సుగర్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన బోనస్ బకాయి సొమ్ము విడుదల అంశానికి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సభ్యులు తరలివచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించుకున్నారు. తామంతా వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని బకాయి సొమ్ము అందించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని, పరిష్కరించకుంటే న్యాయ పోరాటం చేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అమలు కమిటీ సభ్యులు ఆర్.వెంకటాచార్యులు, ఎస్‌డీ ఆజామ్, బీఎం సన్యాసిరావు తదితరులు మాట్లాడారు. సూరప్పగూడెంలోని సహకార చక్కెర ఫ్యాక్టరీని అప్పటి ప్రభుత్వం నష్టాల సాకుతో 2003 డిసెంబర్‌లో విక్రయించింది. 1996 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బోనస్ నిబంధనల మేరకు అర్హత గల ఉద్యోగులు, కార్మికులను బోనస్ నగదు ఇవ్వాల్సి ఉంది. ఫ్యాక్టరీని విక్రయించగా వచ్చిన నిధుల నుంచి కొంత మొత్తాన్ని 2005లో హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ఎస్‌బీహెచ్‌లో డిపాజిట్ చేశారు. అర్హత గల రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు వాటిని అందించాలని, వేరే అవసరాలకు నిధులు వినియోగించవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఏడాది జనవరి 12న హైకోర్టు వారు బ్యాంకులో డిపాజిట్ బోనస్ బకాయిల మొత్తాన్ని అర్హత గల 1,784 మంది రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు అందజేసేలా తీర్పు నిచ్చారన్నారు. అర్హుల్లో కొంత మంది మృతి చెందారని, మరి కొందరు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. రూ.60 లక్షల సొమ్మును చట్టబద్ధంగా అర్హత గల ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఆర్.వెంకటాచార్యులు, ఎస్‌డీ ఆజామ్, బీఎం సన్యాసిరావు, కోడూరి సత్యనారాయణ, ఎం.కోటేశ్వరరావు, కేవీఎస్ బ్రహ్మం, కేఈవీ సూర్యనారాయణ, చెన్నూరి రాంబాబు, బి.అప్పారావు, ఆర్.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, బీహెచ్ భోగయ్య, ఎస్.సత్యనారాయణను ఏన్నుకున్నారు.

ఇంజనీర్లు ప్రగతి సారథులు



ఎలక్ట్రికల్ ఏఈని సన్మానిస్తున్న గణపవరం లయన్స్ క్లబ్ సభ్యులు

గణపవరం: ఇంజనీర్లు సమాజ ప్రగతి సారథులని, వారి సేవలు నిరుపమానమైనవని పలువురు అన్నారు. ఆదివారం ఇంజనీర్స్ డే సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏఈ మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ రీజియన్ చైర్మన్ వెల్లంకి నరేష్ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిరోజున ఇంజనీర్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో గర్వకారణమని, ఆయన సేవలు భావితరాలకు గుర్తుండేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంజనీరు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని కోరారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పచ్చిపులుసు నాగేశ్వరరావు, సత్తినీడి నాని, కోశాధికారి విశారద, లయన్స్ సభ్యులు కిలారి రవిబాబు, కె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు చిరస్మరణీయం

భీమడోలు: నిత్య కృషీవలుడు, నవభారత్ నిర్మాత, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలని మండే సుధాకర్ కోరారు.


రామచంద్రమ్మకు ఘన నివాళులు




మొటపర్తి రామచంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు: విద్యాదాత మొటపర్తి రామచంద్రమ్మ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, మాజీ సర్పంచ్ అజయ్‌కుమార్, మొటపర్తి రాజా, హెచ్‌ఎం శ్రీదేవి, ఎన్‌జీవో, మెడిది నికోలా, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటాద్రి, ప్రముఖ వైద్యుడు బాబు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో మొటపర్తి రామచంద్రమ్మకు అఖిలపక్షం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి నివాళులర్పించారు. అనేక మంది ప్రముఖులు ఆమె సేవలను కొనియాడారు.

అండర్‌పాస్‌లో తొలగని వర్షం నీరు



అండర్‌పాస్‌లో వర్షం నీరు



అండర్‌పాస్‌కు పూర్తిస్థాయిలో నిర్మించని పైకప్పు



పనిచేయని డీజిల్ ఇంజన్

- పాములు, ఉడుములు, తేళ్ల సంచారం
- ప్రయాణానికి గర్భిణులు, విద్యార్థినులు, వృద్ధుల నరకయాతన

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం వద్ద కోట్లాది రూపాయలతో నిర్మించిన అండర్‌పాస్ నిర్మాణం రెండు మండలాల ప్రజలకు నరకంగా మారింది. రైల్వే ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వృద్ధులు, విద్యార్థినులు, గర్భిణు లు, ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. అండర్‌పాస్ నిర్మించి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పైకప్పు రేకు అలుగులగూడెం వైపు వేయలేదు. వర్షం వస్తే అండర్‌పాస్‌లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో రెండు మండలాల ప్రజలకు నరకంగా మారింది. దీనికి తోడు సాయంత్రం 5గంటలు దాటితే కరెంటు లేకపోవడంతో అండర్‌పాస్‌లో ప్రయాణం మరింత దుర్భరంగా ఉంటోంది. ఆ నీటిలో తేళ్లు, పాములు, ఉడుములు కనిపిస్తున్నాయని పలువురు అన్నారు. అండర్‌పాస్‌లో మట్టి పేరుకుపోవడంతో డీజిల్, ఎలక్ట్రికల్ మోటార్లు నీరు లాగడం లేదు. అండర్‌పాస్ పక్కన రైల్వే ట్రాక్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వారం రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించకపోతే రైల్వే జనరల్ మేనేజర్ సికింద్రాబాద్, ఢిల్లీలో ఉన్నతాధికారులకు వీడియోలు పంపిస్తామని అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, గాలాయగూడెం , గోపన్నపాలెం ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు అన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
99122 20559
90102 23729
Office mail : tpgadvt@gmail.com